క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

పలమనేరు: పలమనేరు మండల వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు డీఆర్‌డీఏ ఏపీఎం హరినాథ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు గురువారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరు కానున్నారని పేర్కొన్నారు. మండలంలోని డ్వాక్రా మహిళలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

నేడు సంత నిర్వహణ వేలం

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లె, నంజంపేట పంచాయతీల్లో సంతగేటు, ప్రవేటు బస్టాండు నిర్వహణలకు శుక్రవారం వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్‌లు భారతి, వెంకటరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పెద్ద ఉప్పరపల్లెలో ఉదయం 11 గంటలకు, నంజంపేటలో మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక సచివాలయాల్లో అధికారుల ఆధ్వర్యంలో వేలం పాటలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

గ్రామాల్లో ఫాగింగ్



రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలో దోమల నివారణకు బుధవారం రాత్రి ఫాగింగ్ చేశారు. వైఎస్సార్‌సీపీ పంచాయతీ ఇన్‌చార్జి కోటా వెంకటరమణ దగ్గరుండి ఫాగింగ్ చేయించారు. గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరిగాయని, వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలో భాగంగా ఫాగింగ్ చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రామచంద్రాపురం కాలనీ, సర్వర్‌పేట, ఫజులుపేట గ్రామాల్లో ఫాగింగ్ చేసినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా ఫాగింగ్ చేస్తామని చెప్పారు. కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.

చోరీ సొత్తు రికవరీ

రామకుప్పం: మండలంలోని వీర్నమల గ్రామంలో ఓ వస్త్ర దుకాణంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన చోరీ కేసుకు సంబంధించి సొత్తును గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. దుకాణ యజమాని స్వామినాథన్ కుమారుడు గాంధీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలో ఇద్దరు బాలురు ఆరిమానుపెంట చెక్‌పోస్టు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుంటే అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. గుట్టూరు తండాకు చెందిన వీరి నుంచి చోరీకి గురైన వస్త్రాలు, సెల్‌ఫోన్, రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీజేపీ నాయకుడు నాగరాజు మృతి




పలమనేరు: పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు గంటే నాగరాజు(54) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి స్థానిక బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు సంతాపాన్ని తెలిపారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల కస్తూర్బా గురుకుల పాఠశాలలో 2023–24 సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి సుజాత తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ సీఈసీ గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. 7, 8, 9 తరగతుల్లో నాలుగు సీట్లు మాత్రమే ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బాలికలు మాత్రమే అర్హులని తెలిపారు. విద్యార్థి ఆధార్ కార్డుతోపాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డు, బియ్యం కార్డు, మూడు ఫొటోలు, పూర్వ పాఠశాలలో చదివిన స్టడీ సర్టిఫికెట్ తప్పని సరిగా ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌వో కోరారు. వివరాలకు తమ పాఠశాలలో సంప్రదించవచ్చని తెలిపారు.

వీరాంజనేయస్వామికి పట్టువస్త్రాలు



చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం పొన్నియమ్మగుడివీధిలోని శ్రీవీరాంజనేయస్వామికి గురువారం రాత్రి ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి సారె, పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు సుధాకర్ గురుకుల్ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందించారు. ప్రసాదం అందజేశారు.

అతివలకు ఆసరా

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలు పేద మహిళల ఆర్థిక సాధికారితను పెంపొందిస్తున్నాయి. గ్రూపులో ఉంటూ కూలినాలి చేసుకొనే కుటుంబాలకు వైఎస్సార్ ఆసరా అండగా మారింది. తద్వారా స్వయం ఉపాధి, చిరువ్యాపారాలు, పాడిఆవుల పోషణ ద్వారా వీరి బతుకుల్లో వెలుగులు నింపుతున్నాయి. వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు పంపిణీ కార్యక్రమం వారోత్సవాలు ప్రస్తుతం పలమనేరు నియోజకవర్గంలో సాగుతున్నాయి. మూడో విడత నియోజగవర్గంలో రూ.48 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయి.



పలమనేరు: ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం (ఫైల్)

- పేద మహిళలకు అండగా వైఎస్సార్ ఆసరా
- మహిళా సాధికారిత రేటు పెంచడమే లక్ష్యం
- గతంలో డ్వాక్రా మహిళలను ఏమార్చిన టీడీపీ ప్రభుత్వం
- పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం
- పలమనేరు నియోజకవర్గంలో లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 48 కోట్లు జమ

పలమనేరు : పలమనేరు నియోజకవర్గంలో ఐదు మండలాల్లో కలిపి 5,179 గ్రూపుల్లో 47,366మంది సభ్యులున్నారు. వీరికి వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగు విడతల్లో మొత్తం రూ.193.17కోట్లను పంపిణీ చేయాల్సి ఉంది. మొదటి విడతగా రూ. 48.27కోట్లు, రెండో విడతగా రూ.48.39 కోట్లు ఇప్పటికే బ్యాంకు ఖాతాలకు జమ అయ్యాయి. ప్రస్తుతం మూడో విడతగా రూ.48కోట్లు జమ అవుతున్నాయి. ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ. 144.95కోట్లు జమ అయ్యాయి. మిగిలిన మొత్తాన్ని వచ్చే ఏడాది జమచేయనున్నారు.

మున్సిపాలిటీకి సంబంధించి..

మున్సిపాలిటీలో 6,732 సంఘాలు ఉండగా, వైఎస్సార్ ఆసరాకు 785 సంఘాలు అర్హత సాధించాయి.ఈ గ్రూపుల్లో మొత్తం 6,732మంది సభ్యులున్నారు. వీరికి తొలివిడతగా రూ.7.69కోట్లు, రెండో విడతలో రూ.7.73కోట్లు, ప్రస్తుతం మూడో విడతలో రూ.7.71కోట్లను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో మున్సిపాలిటీతో కలిపి వైఎస్సార్ ఆసరాలో మూడు విడతల్లో రూ.168.08 కోట్లు జమ అయింది.

బాబు పాలనలో గ్రూపు మహిళలకు దగా

డ్వాక్రా రుణ మాఫీ హామీతో 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. అయితే ఆపై ఆ హామీని నిలబెట్టుకోకుండా మహిళలకు దగా చేసింది. చంద్రబాబు హామీతో బ్యాంకుల్లో రుణాలను చెల్లించని గ్రూపులను బ్యాంకర్లు బ్లాక్‌లో పెట్టారు. దీంతో మహిళలు అప్పులపాలైయ్యారు. ఫలితంగా సంఘాలు నిర్వీర్యమయ్యాయి. తమ కొచ్చిన కష్టాలను నాటి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో గ్రూపు మహిళలు తెలుపుకున్నారు. నాడు ఆయన ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగు విడత వారి బ్యాంకు ఖాతాల్లోకి జమచేస్తూ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు.

మూడో విడత ఆసరా పంపిణీ ఇలా...

మండలం	సంఘాలు	సభ్యులు	3వ విడత (కోట్లలో)
పలమనేరు	656	5860	5.36
బైరెడ్డిపల్లె	1056	9314	9.63
గంగవరం	1056	9554	10.35
పెద్దపంజాణి	1111	10641	11.18
వీ.కోట	1290	11997	11.78

హోటల్ నడుపుకుంటున్నాం



మేము హోటల్ వ్యాపారం చేస్తున్నాం. గతంలో బ్యాంకు అప్పు కట్టక ఇబ్బందులు పడ్డాం. వైఎస్సార్ ఆసరాలో మూడు విడతల ద్వారా రూ.72వేల వరకు అందింది. దీంతో హోటల్‌కు ఆసరాగా మారి ఇబ్బందులు లేకుండా వ్యాపారం చేసుకుంటున్నాం.

– శోభ, విజయ ఎస్‌హెచ్‌జీ, పాతపేట, పలమనేరు

ఎంతో ఉపయోగపడింది



నేను స్వీట్లు, స్నాక్స్ వ్యాపారం చేస్తున్నా. వైఎస్సార్ ఆసరాలో రూ.44 వేలు వచ్చింది. చిన్నపాటి వ్యాపారానికి ఈ నగదు ఎంతగానో ఉపకరించింది. జగనన్న నాడు ఇచ్చిన మాటను నిలుపుకున్నారు. తనలాంటి ఎందరికో ఆసరా నగదు ఉపయోగపడుతోంది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– ఎబెంజర్, సాయిరాం ఎస్‌హెచ్‌జీ, పలమనేరు

పథకాలపై ఇంటింటి ప్రచారం

పులిచెర్ల(కల్లూరు): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా పొందిన లబ్ధిని వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని వెంకటదాసరపల్లె పంచాయతీలో ఇంటింటికీ వెళ్ల లబ్ధిదారులను కలిశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని అంకెలతో సహా వివరించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని ఆదరించాలని, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే మరిన్ని పథకాలను తీసుకు వస్తారని తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు పోకల చంద్ర, నాదమునిరెడ్డి, దామోదర్, ద్వారక, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకట దాసరపల్లెలో ఇంటింటి ప్రచారంలో

నలుగురు జూదరుల అరెస్ట్

చౌడేపల్లె: కేతనపల్లె సమీప అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ దుర్గసముద్రం పంచాయతీ కేతనపల్లెకు చెందిన నలుగురు అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశామని పేర్కొన్నారు. నలుగురిని అరెస్టు చేసి, రూ.17,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హనుమంతుడిపై సీతారాములు



కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధంగా ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి నూతన వధూవరులను పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి హనుమంతు వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం మేళతాళా లు, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

చౌడేపల్లె: మండలంలోని మేకలచిన్నేపల్లె వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె పంచాయతీ సల్లాపురం వడ్డిపల్లెకు చెందిన కె.వెంకటరమణ మేకల చిన్నేపల్లె వద్ద మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేసి అతన్ని అదుపులోకి తీసుకొని 20 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పోలీసుల చెంతకు గురువుల పంచాయితీ!

పలమనేరు/పెద్దపంజాణి: సమాజానికి మార్గనిర్దేశకులైన ఇద్దరు గురువుల పంచాయతీ నియోజకవర్గంలోని పెద్దపంజాణి పోలీసు స్టేషన్‌కు చేరిన సంఘటన గురువారం వెలుగుచూసింది. వివరాలిలా.. పెద్దపంజాణి మండలంలో ముద్దేపల్లి, లింగాపురం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఒక ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలి వాట్సాప్ చాటింగ్ వ్యవహారం ఇరు కుటుంబాల మధ్య గొడవలకు దారితీసింది. ఈ విషయం పెద్దపంజాణి పోలీసుల చెంతకు చేరినట్టు తెలిసింది. విషయం బయటికి పొక్కకుండా..పెద్దది కాకుండా ఆ మండలానికి చెందిన ఓ ఉన్నతాధికారి చక్కదిద్దినట్టు తెలిసింది. ఏదేమైనా ఈ సంఘటనపై అక్కడి పోలీసులు ఇరువర్గాలను విచారిస్తున్నట్టు తెలుస్తోంది. పూర్తి వివరాలు విచారణలో తేలాల్సి ఉంది.

కురబల కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

పలమనేరు: రాష్ట్రంలోని కురబ కులస్తులను బీసీ నుంచి ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 3,4 తేదీల్లో ఢిల్లీలో జరిగే హలో కురుబ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్రంలోని కురుబల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని బీసీ నుంచి ఎస్టీ జాబితాలో చేర్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కురబ కులానికి చెందిన విద్యావంతులు, ఉద్యోగులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కోర్టు తీర్పు మేరకే స్థలం స్వాధీనం

వి.కోట: వి.కోట పట్టణంలో ఓ స్థలం కోసం రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదాన్ని పార్టీ వర్గాలతో ముడిపెడుతూ ప్రచార మధ్యమాల్లో, పత్రికల్లో ప్రకటించడం సరికాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు మండిపడ్డారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని భారత్ థియేటర్ పక్కనున్న స్థలాన్ని తన తండ్రి పీఎస్ కృష్ణప్ప 30 ఏళ్ల కిందట కొనుగోలు చేశారని తెలిపారు. ఇక్బాల్ అనే వ్యక్తి ఉద్దేశపూర్వకంగా కోర్టులో కేసు వేసి ఇబ్బందులకు గురి చేశారన్నారు. 30 ఏళ్ల అనంతరం ఈ నెల 23వ తేదీన కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. కోర్టు తీర్పును గౌరవించకుండా అక్రమంగా ఆ స్థలంలోకి ప్రవేశించిన వారే ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇందులో పార్టీలు, కులాలలు, మతాలకు సంబంధం లేదని తెలిపారు. రాజకీయాలు, మతాల పేరుతో ప్రజలను రెచ్చగొడితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు.

జగదానంద కారకా..



పలమనేరు: కొలమాసనపల్లెలో విశేషాలంకరణ



గుడుపల్లె: ఎగువచిగర్లపల్లెలో..



పెద్దపంజాణి : ఆలయంలో భక్తులు




పలమనేరు : అభయాంజనేయస్వామి ఆలయంలో..



కుప్పం: శ్రీరామాలయంలో ..



పుంగనూరు. మార్గపల్లెలో ..



సోమల: పత్రపల్లెలో..



పలమనేరు : ఆలయ ప్రారంభోత్సవంలో భక్తులు

పలమనేరు: పలమనేరు పట్టణం, మండలంలో శ్రీరామనవమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్దగాండ్ల వీధిలోని శ్రీరా ముల ఆలయం, బజారువీధిలోని అభయాంజనేయస్వామి ఆలయం, పాతపేటలోని భజనగుడి, వేణుగోపాలస్వామి ఆలయం, శ్రీపొట్టి శ్రీరాములు జవిళివీధిలోను శ్రీసీతారామాంజనేయుల స్వామి వారి భజన మందిరంలో ప్రత్యేక అలంకరణలు, పూజలు జరిగాయి. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వడపప్పు, పానకం, తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీసీతారామాంజనేయ స్వామి భజన మందిరంలో నవమి ఉత్సవాలు ప్రారంభయ్యాయి. పలుచోట్ల పానకం పంపిణీ చేశారు. మండలంలోని మొరం సమీపంలోని అంజనాద్రిపురం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కొలమాసనపల్లె రామాలయంలో సీతా రాముల కళ్యాణం నేత్రపర్వంగా జరిగింది. పట్టణ సమీపంలోని చెరువుకట్టపై నూతన ఆంజినేయస్వామి ఆలయాన్ని శ్రీరామనవమి సందర్భంగా ప్రారంభించారు.

పుంగనూరు: శ్రీరామనవమి పండుగ సందర్భంగా గురువారం శ్రీరామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ నామ స్మరణలు మిన్నంటాయి. పట్టణంలోని హనుమంతురాయునిదిన్నెలో శ్రీఆంజనేయస్వామి, సుబ్బమ్మ చెరువు వద్ద వెలసి ఉన్న శ్రీఆంజనేయస్వామికి, కట్టకిందపాళ్యెంలోని శ్రీకోదండ రామ స్వామి ఆలయాల్లో విశేష అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. మార్లపల్లెలోని శ్రీఅభయాంజనేయస్వామి, అరవపల్లె వద్ద ఉన్న శ్రీవీరాంజనేయస్వామి, హైస్కూల్‌వీధిలోని శ్రీకోదండరామస్వామి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. వేకువ జాము నుంచి అభిషేక పూజలు, హోమాలు నిర్వహించారు. పలు ఆలయాల్లో రామకీర్తనలు, భజనలు, అఖండ పారాయణాలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పానకం, వడపప్పు, మజ్జిగ పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కుప్పం: పట్టణంలోని రాధాకృష్ణా రోడ్డులో వెలసి ఉన్న శ్రీరామాలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. అలాగే అంజనేయస్వామి, కోదండ రామాలయంలో వేడుకలు ఘనంగా చేపట్టారు. పానకం, పెసర పప్పు ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. పట్టణ సమీపంలోని గుత్తార్లపల్లెలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి సీతారాములు కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా చేపట్టారు.

గుడుపల్లె: మండలంలోని అనగర్లపల్లె శ్రీరామ మందిరం, చిగర్లపల్లె ఆంజనేయ స్వామి, చప్పిడిగరుగులు ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద పానకం, పెసర పప్పును అందించారు. రాత్రి రామ కోటి కార్యక్రమాన్ని నిర్వమించారు.

పులిచెర్ల(కల్లూరు): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో గురువారం సీతారాముల ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మతుకు వారిపల్లెలోని సీతారాముల ఆలయంలో సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మండల కేంద్రంలోని శ్రీరాములగుడిలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. గాజులపల్లె శ్రీరామాలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

పెద్దపంజాణి: రాయలపేట శ్రీకోదండరామస్వామి ఆలయంలో నవమి వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సీత, లక్ష్మణ, ఆంజనేయ సహిత శ్రీరామచంద్రమూర్తి మూలవిరాట్‌లకు విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను హంస వాహనంపై ఊరేగించారు.

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె శ్రీకోదండరామస్వామి ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయం, కార్వేటికొండపై వెలసిన శ్రీధ్యానాభిరామస్వామి ఆలయం, తొరిడి సమీపంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయం, పట్టుపల్లె సమీపంలో వెలసిన శ్రీ కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. బైరెడ్డిపల్లె మెయిన్‌రోడ్డులో వాసవీ ఫౌండేషన్ నిర్వాహకులు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు.

వీకోట రామాలయంలో జెడ్పీ చైర్మన్ పూజలు



సీతారాములను దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: పట్టణంలోని శ్రీరామాలయంలో నవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు.అనంతరం స్వామి వారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పూజా కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. శ్రీ సీతారాములను దర్శించుకుని, తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం శ్రీసీతారామ,లక్ష్మణ,హనుమంత ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. డప్పులు, మంగళ వాయిద్యాలు, కీలు బొమ్మల ప్రదర్శనల నడుమ ఊరేగింపు వైభవంగా జరిగింది.

భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

సోమల: ఆవులపల్లె పంచాయతీ పత్రపల్లె శ్రీకోదండ రామస్వామి ఆలయంలో గురువారం నవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 9వ తేదీ వరకు 10 రోజుల పాటు నవమి ఉత్సవాలు జరుగుతాయని కార్యనిర్వాహకులు తెలిపారు. 5వ తేదీ శ్రీసీతారాముల కల్యాణం, 8వ తేదీన పుష్పపల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయంప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సదుం: ఎర్రాతివారిపల్లె, తాటిగుంటపాలెం, నడి గడ్డ పంచాయతీ వెంకటరెడ్డి గారిపల్లె, పెడకంటివారిపల్లె రామాలయాల్లో నవమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీసీతారాముల కల్యాణోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకం, తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు.

శాంతిపురం: రాళ్లబూదుగూరు శ్రీకోదండరామ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. మొరసనపల్లె, మఠం వద్ద ఉన్న ఆంజనేయ ఆలయంలో జరిగిన పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దండికుప్పం రామాలయంలో రామకోటి, కల్యాణోత్సవం, భజనలు, కోలాటలు, అన్నదానం నిర్వహించారు. గుండిశెట్టిపల్లె భజన మందిరంలో పూజల అనంతరం మూడు రోజుల పాటు నిర్వహించే రామకోటిని ప్రారంభించారు.

చౌడేపల్లె: చౌడేపల్లె, బిల్లేరు, గాండ్లపల్లె, ఓదులపేట, కోటూరు, ఊటూరు, కొలింపల్లె గ్రామాల్లోని శ్రీరామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవమూర్తులను ఊరేగించారు.

కమనీయం..కల్యాణం



గంగవరం: సీతారాముల కల్యాణం



పాల్గొన్న భక్తులు

గంగవరం: మండలంలోని నల్లసానిపల్లె శ్రీకోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు, కైంకర్యాలు, హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సీతారాములు కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. శాస్త్రోక్తంగా జరిగిన కల్యాణాన్ని వీక్షించి భక్తులు తరించారు. విరాళాలు సేకరించి ఆలయాన్ని అభివృద్ధి చేశామని, ఏటా శ్రీరామనవమి వేడుకలు, పల్లకీసేవ ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం పల్లకీసేవ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.